క్లుప్తంగా

వైభవంగా ఆర్జిత సేవలు


కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

పదోతరగతి విద్యార్థులకు ఘన వీడ్కోలు


ఉపాధ్యాయులతో పదో తరగతి విద్యార్థులు

సింహాచలం: సుజాతనగర్‌లోని ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో బుధవారం పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి సూచనలు, సలహాలు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రమాదేవి, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి హామీ


చర్చలు అనంతరం బయటకు వస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి యాజమాన్యం అంగీకరించిందని టీఎన్‌టీయూసీ,బీఎంఎస్ నాయకులు చెప్పారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ధర్నా చేపట్టడంతో యాజమాన్యం దిగివచ్చింది. టీఎన్‌టీయూసీ, బీఎంఎస్ నాయకులతో బుధవారం చర్చలు జరిపింది. 2022 ఏప్రిల్ నుంచి కార్మికులకు ప్రత్యేక అలవెన్స్‌ను రూ.2500 చెల్లించాలని బీఎంఎస్ పట్టుపట్టింది. రూ.2300 అలవెన్స్‌గా చెల్లించే విధంగా ఇరు వర్గాల మధ్య అంగీకారం కుదిరింది. నెలకు 18 రోజులు పని చేసిన కార్మికులకు పూర్తి స్థాయిలో అలవెన్స్ మంజూరు చేయడానికి యాజమాన్యం అంగీకరించింది. ఒకే రకమైన గేట్ పాస్‌లు, ఐడీ కార్డులు, జీతం స్లిప్‌లు కాంట్రాక్టు కాలపరిమితి వరకు మంజూరు చేయడానికి యాజమాన్యం అంగీకరించింది. చర్చల్లో టీఎన్‌టీయూసీ యూనియన్ ప్రతినిధి మాసవరపు అప్పలనాయుడు, బీఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

'ప్రైవేట్'లో 25 శాతం సీట్లపై 5న అవగాహన సదస్సు

మద్దిలపాలెం: పేద విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లలో ఒకటోతరగతిలో 25 శాతం సీట్లు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.24పై ఈ నెల 5న అవగాహన సదస్సు నిర్వహించనున్నామని రైట్ టూ ఎడ్యుకేషన్ ఫోరం ప్రతినిధి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా హక్కు చట్టంలో భాగంగా కేటాయించనున్న 25 శాతం సీట్లపై తల్లిదండ్రులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వనున్నామన్నారు. బుల్లయ్య కళాశాల గాంధీ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు ఈ సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ఆర్‌జేడీగా మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌కు బాధ్యతలు


డాక్టర్ శోభారాణిని అభినందిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి జోన్–1 రీజనల్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జేడీ)గా పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది బుధవారం ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు ఆరోగ్య యోగం

ఎన్టీపీసీ సహకారంతో యోగా తరగతులు


విభిన్న ఆసనంలో విద్యార్థులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సహకారంతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యోగాలో ఇస్తున్న శిక్షణ సత్ఫలితాలిస్తోంది. విద్యార్థులు ఉత్సాహంగా ఉండడంతో పాటు ఏకాగ్రత సాధిస్తున్నారు. పలు ఆసనాలు వేయడం ద్వారా ఆరోగ్య ప్రయోజనం పొంది లక్ష్యం వైపు అడుగులు వేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపుతున్నారు. ఇక్కడ విద్యార్థులకు యోగాసనాలతో పాటు క్రియలు, ప్రాణాయామం వంటి యోగాసనాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. అందుకోసం ప్రత్యేక శిక్షకులను నియమించింది. పిల్లలకు ఆరోగ్యపరమైన యోగాసనాలైన సూత్ర నీతి, క్రియ నేతి, జలనేతి వంటి ఆసనాలు వేయిస్తున్నారు. వీటిని సాధన చేయడం ద్వారా చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులు దూరం కావడమే కాకుండా ఏకాగ్రత లభిస్తోందని విద్యార్థులు చెబుతున్నారు.

శ్వాస సంబంధ వ్యాధి నుంచి ఉపశమనం



తానాం గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. ఎన్టీపీసీ సహకారంతో 6 ఏళ్ల నుంచి యోగాలో శిక్షణ పొందుతున్నాను. శ్వాస సంబంధమైన వ్యాధితో ఇబ్బంది పడేదాన్ని. యోగాలో ఓ భాగమైన నేతి క్రియ ఆసనాలు చేయడం ద్వారా ఉపశమనం కలగడమే కాకుండా చదువుపై ఏకాగ్రత పెరిగింది.
– ఎం.తేజశ్వనీ, టెన్త్‌క్లాసు, గురుకుల పాఠశాల, తానాం

ఏకాగ్రత పెరిగింది



తానాం గురుకుల పాఠశాలలో టెన్త్ క్లాస్ చదువుతున్నాను. మొదట్లో ఏకాగ్రత కుదరకపోవడంతో చదువు మీద శ్రద్ధ ఉండేది కాదు. సూత్ర నేతి క్రియ ఆసనం వేయడం వల్ల మంచి ఫలితం వచ్చింది. ఏకాగ్రత కుదిరి చదువు మీద శ్రద్ధ పెరగడమే కాకుండా శ్వాస సంబంధిత వ్యాధులు తొలగిపోయాయి. ఎప్పుడూ ఉత్సాహంగా ఉండగలుగుతున్నాను.
– టి.ఉష శ్రీ, టెన్త్ క్లాసు, గురుకుల పాఠశాల, తానాం

యోగాతో వ్యాధులు నయం



యోగాసనాలతో పాటు సూత్ర నేతి క్రియ, జల నేతి క్రియ ఆసనాలు పిల్లలు చేత చేయించడం ద్వారా చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులు దూరమవుతాయి. మంచి ఆరోగ్యవంతంగా ఉంటారు. ఎన్టీపీసీ సహకారంతో ఏడేళ్ల నుంచి యోగా శిక్షకుడిగా పరవాడ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యోగా శిక్షణ ఇస్తున్నాను.
– సీహెచ్.ఆంజనేయులు, యోగా శిక్షకుడు

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న శాస్త్రవేత్త చిదంబరం దంపతులు


అప్పన్న ఆలయంలో ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం ప్రఖ్యాత అణు శాస్త్రవేత్త, భారత ప్రభుత్వ మాజీ శాస్త్ర సలహాదారు, పద్మ విభూషణ్ డాక్టర్ ఆర్.చిదంబరం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. అలాగే దేవస్థానం అన్నప్రసాద పథకానికి రూ1.50 లక్షలు విరాళం ఆయన నగదు రూపంలో అందజేశారు.

ఇన్‌కమ్ ట్యాక్స్ ఉన్నతాధికారులు..
శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం ఇన్‌కమ్‌ట్యాక్స్ ఎక్సెంప్షన్స్ కమిషనర్ బాలకృష్ణ దంపతులతో పాటు సంయుక్త కమిషనర్ కోటేశ్వరమ్మ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి ప్రసాదాన్ని ఈవో త్రినాథరావు వారికి అందజేశారు.

అదృశ్యమైన విద్యార్థుల ఆచూకీ లభ్యం

పరవాడ: గత నెల 27న అదృశ్యమైన పెదతాడి గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థుల ఆచూకీ లభ్యమైందని సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు చెప్పారు. పెదతాడి గ్రామానికి చెందిన శానాపతి హేమంత్‌కుమార్, శానాపతి మూర్తిరాజు తానాం పాఠశాలకు వెళతామని చెప్పి గత నెల 27 సాయంత్రం నుంచి కనిపించకుండా పోయారు. విద్యార్థుల ఆచూకీ కోసం గాలించిన అనంతరం తల్లిదండ్రులు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాలింపు చేపడుతున్న పోలీసులకు హేమంత్‌కుమార్ కూర్మన్నపాలెంలో పట్టుబడ్డాడు. మూర్తిరాజు కూడా అమ్మమ్మ ఇంటి వద్ద ఉన్నట్టు పోలీసులు కనుగొన్నారు. విద్యార్థులిద్దరినీ బుధవారం వారి తల్లిదండ్రులకు అప్పగించామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

నిరంతర అధ్యయనంతో మెరుగైన ఫలితాలు


మాట్లాడుతున్న రిటైర్డ్ డీజీపీ సాంబశివరావు


ఏయూ క్యాంపస్: నిరంతర అభ్యసనం, అధ్యయనంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని రిటైర్డ్ డీజీపీ ఎన్.సాంబశివరావు అన్నారు. ఏయూ అర్థ శాస్త్ర విభాగ సమావేశ మందిరంలో బుధవారం ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఒక నిర్దిష్టమైన అంశంపై లోతైన అవగాహన కలగాలంటే ముందుగా పలుమార్లు దానిని చదవాలన్నారు. తద్వారా అర్థం చేసుకుని, అవగాహన పెంచుకోవడానికి వీలవుతుందన్నారు. ముఖ్యమైన అంశాలపై నోట్స్ తయారీ, సివిల్ సర్వీస్ పరీక్షలకు సిద్ధం కావడంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పరీక్షకు సన్నాహం, చదవాల్సిన పుస్తకాలపై ఆయన అవగాహన కల్పించా రు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య డి.పుల్లారావు, విభాగ ఆచార్యులు జి.నాగరాజు, డాక్టర్ బి.లిల్లీ గ్రేస్, డాక్టర్ డి.ఆశాలత, డాక్టర్ వి.వి.ఎస్.రామకృష్ణ, పాల్గొన్నారు.

కేంద్రం కుట్రలో భాగమే..


కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న రామారావు

కూర్మన్నపాలెం: కేంద్రప్రభుత్వ కుట్రలో భాగంగానే విశాఖ ఉక్కును నష్టాల బారిన నెట్టి సిక్ ఇండస్ట్రీగా ప్రకటించాలని చూస్తున్నారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆరోపించారు. దీనిలో భాగంగానే సంస్థలోని అనేక విభాగాలను మూసివేసిందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 748వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షాశిబిరంలో సంస్థకు చెందిన ఈ అండ్ ఎస్ఎఫ్, ఈఎండీ, ఈఆర్ఎస్, సేఫ్టీ, టెలిసెల్, ఎస్ఎస్‌డీ, ఆగ్రో విభాగాల కార్మికులు కూర్చున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని వెనక్కి తీసుకునే వరకు వివిధ రీతిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థల జోలికి వస్తే కార్మికులు చూస్తూ ఊరుకోరని, కార్మికులను విస్మరించిన ప్రభుత్వాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం


సచివాలయంలో అవగాహన కల్పిస్తున్న దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్ ప్రసాద్ రాజా

పెదగంట్యాడ: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, చేయించడం నేరమని దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా అన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు దేవాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కేఎస్‌పాలెం సచివాలయంలో మహిళలకు, అనంతరం ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు లింగ నిర్ధారణ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్న వారు ఆడ శిశువులైతే గర్భంలోనే చిదిమేస్తున్నారని, దీంతో ప్రభుత్వం చట్టం తీసుకువచ్చిందని గుర్తుచేశారు. దానిని పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం 104 అంబులెన్సులో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను ప్రారంభించారు.

నూకాంబిక ఆలయ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం

సింహాచలం: పెందుర్తి మండలం చింతలగ్రహారంలో కొత్తగా నిర్మించిన నూకాంబిక ఆలయ ప్రతిష్ఠాన మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం నాలుగు గంటల నుంచి గ్రామంలో అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగించారు. ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా గురువారం ప్రతిష్ఠా సంకల్పం, విఘ్నేశ్వరపూజ, హోమాలు,సాయంత్రం 5నుంచి సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నారు. అలాగే 3న ఉదయం 6.30 గంటలకు కళాన్యాస హోమాలు, ఉదయం 7.23 గంటలకు యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, దర్ప దర్శనం, మహా పూర్ణాహుతి ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

విజయభారతికి డాక్టరేట్ ప్రదానం



సింహాచలం: పెందుర్తి మండలం సుజాతనగర్‌కు చెందిన మంజేటి విజయభారతికి గీతం యూనివర్సిటీ డాక్టరేట్ లభించింది. గీతం యూనివర్సిటీలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న విజయభారతి కంప్యూటర్ సైన్సులో పీహెచ్‌డీ చేశారు. కంప్యూటర్ సైన్సులోని జనరేటింగ్ ఆప్టిమల్ టెస్ట్ కేసెస్ జనరేషన్ యూజింగ్ మెస్సీ జెనటిక్ ఆల్గోరిథమ్‌లో ఆమె పీహెచ్‌డీ చేసి ప్రతిభ కనబరిచారు. కంప్యూటర్ సైన్స్ హెడ్ ఆఫ్‌ద డిపార్ట్‌మెంట్ డాక్టర్ రొడ్డా శిరీష పర్యవేక్షణలో ఆమె పీహెచ్‌డీ పూర్తి చేశారు. పీహెచ్‌డీతో మరింత బాధ్యత పెరిగిందని విజయభారతి సంతోషం వ్యక్తం చేశారు.

రైల్వే ట్రాక్‌పై వ్యక్తి ఆత్మహత్యాయత్నం


రైల్వే ట్రాక్ మీద ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి

మహారాణిపేట: మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ సమీపంలో రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ఆయన కుడి చేయి తెగిపడింది. 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుడి వయస్సు 45 ఏళ్ల ఉండ వచ్చునని 108 వాహన సిబ్బంది తెలిపారు.

3న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఈ నెల 3న ఉచిత ఆయుర్వేద వైద్య చికిత్స శిబిరాన్ని నిర్వహించనున్నట్టు కేంద్రం విభాగాధిపతి డాక్టర్ కె.రమేష్‌బాబు తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బీచ్‌రోడ్డులోని యోగా కేంద్రంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. విశ్రాంత ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ కె.ఈశ్వరరావు రోగులను పరీక్షించి తగిన చికిత్స విధానాలను సూచిస్తారన్నారు. దీర్ఘకాలిక రోగులు తమ మెడికల్ రిపోర్టులను తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ

పెదగంట్యాడ: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) పథకంలో భాగంగా జిల్లాలోని 15 ఏళ్ల నుంచి 45 ఏళ్ల నిరుద్యోగులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీ ప్రిన్సిపాల్ లండా సుధాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్టర్, ఫ్యాబ్రికేషన్, టిగ్ వెల్డింగ్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, సీఎన్‌సీ టర్నింగ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ప్లంబర్ జనరల్ అండ్ లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ (ఎల్ఎంవీ) తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణకు పదో తరగతి పాస్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. డ్రైవింగ్ శిక్షణకు 18 ఏళ్లు నిండి ఉండాలని, పదో తరగతి పాసైన, ఫెయిలైన వారితో పాటు ఐదో తరగతి చదువుకున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం తమ కార్యాలయంలో ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ జిరాక్స్, ఫోన్ నంబర్, ఈ మెయిల్ ఐడీతో తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సీతరాంజుకు మద్దతుగా ప్రచారం


సుజాతనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్


95వవార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: ఈనెల 13న జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కోరారు. సుజాతనగర్‌లో ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులను కలిశారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టిన సీతంరాజు సుధాకర్ అభ్యర్థిత్వానికి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో 97వవార్డు అధ్యక్షుడు మెంటి మహేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● 95వ వార్డులోని పాపయ్యరాజుపాలెం, బీసీ కాలనీ, ఆర్‌టీసీ కాలనీ, శివగాయత్రీనగర్‌లో వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పేరూరి చినబాబు, రోమాల నూకరాజు, కేవీఆర్.లక్ష్మి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కోలా గురువులకు సత్కారం


కోలా గురువులను సత్కరించిన బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు

పరవాడ: రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడంపై సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు బందం పైడిరాజు ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు బుధవారం కోలా గురువులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బండారు సోమునాయుడు, జిల్లా యూత్ అధ్యక్షుడు సీహెచ్ కొర్లయ్య, జిల్లా మహిళ కార్యదర్శి కూండ్రపు ఉమామహేశ్వరి, పెందుర్తి మహిళా కన్వీనర్ గండి లలిత, బండారు ఉమాదేవి పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ


టాస్‌వేసి టోర్నీని ప్రారంభిస్తున్న దొడ్డి ప్రకాష్

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెంలో కొలువైన మత్యాలమ్మ పండగను ఈ నెల 9వ తేదీన నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి పండగ పురస్కరించుకుని నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం మాజీ ఎంపీటీసీ దొడ్డి ప్రకాష్ ప్రారంభించారు. ముత్యమాంబ క్రికెట్ గ్రూపు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టోర్నీలో విజేతలకు వరుసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నారు. పోటీలను ప్రారంభించిన వారిలో గ్రామ పెద్దలు,నాయకులు దాడి కన్నంనాయుడు,రాపేటి రాము పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బాబూరావు


రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణతో నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గం

సబ్బవరం: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా నూతన అధ్యక్షుడిగా సబ్బవరం మండల పరిషత్ ఏవో ఎస్. బాబూరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ అధ్యక్షతన విశాఖలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడితో పాటు మిగిలిన కార్యవర్గాన్ని సభ్యులంతా ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అసోసియేట్ అధ్యక్షుడిగా బీవీ రావును, ఉపాధ్యక్షులుగా ఎ. నాగేశ్వరరావు, పీవీ రమణ,రామలింగేశ్వరరావు, జె. అప్పారావు ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా రవికుమార్, సెక్రటరీగా ఐ. శ్రీనివాస్ కుమార్, జాయింట్ సెక్రటరీలుగా ఆర్‌వీఎస్ అప్పారావు, ఏవీఆర్ ప్రేమ్ కుమార్,జి. నాగేశ్వరరావు,వి. వెంకటరావులను, కోశాధికారిగా వైవీ రాజేశ్వరరావును ఎన్నుకున్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్‌లో పాల్గొని ప్రతిభ చూపిన ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం విద్యార్థులను వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. తమిళనాడులోని మధురై నగరంలోని త్యాగరాజన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో జరిగిన యుక్తి 23 మేనేజ్‌మెంట్ మీట్‌లో పాల్గొన్న ఎంబీఏ విద్యార్థులు ఎం.స్వర్ణలత, కె.వి.వైష్ణవి, కె.ఆశిష్, ఎన్.భరత్‌కుమార్‌లు వివిధ పోటీలలో విజయం సాధించడంపై వీసీ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డాక్టర్ ఎస్.రంజిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ప్రశాంతత


ధ్యాన శిక్షణలో పాల్గొన్న ఔత్సాహికులు

మల్కాపురం: భగవాన్ బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ఆశీస్సులతో స్థానిక పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ ఆధ్వర్యంలో బుధవారం 60వ వార్డు జవహర్‌నగర్ సన్‌రైజ్ కిడ్స్ స్కూల్‌లో ఉచిత ధ్యాన శిక్షణ–జ్ఞాన బోధ కార్యక్రమం నిర్వహించారు. దీన్ని కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు పి.వి.సురేష్ ప్రారంభించి మాట్లాడారు. శ్వాస మీద ధ్యాసే ధ్యానమని, ఇది మనిషిలో శాంతిని నింపుతుందన్నారు. తద్వారా ఆ వ్యక్తి పరులకు సేవ చేయాలనే ఆలోచనతో, ప్రేమగా మసులుకోవాలని తలంపుతో ఉంటాడన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ ధ్యాన శిక్షణ–జ్ఞాన బోధన కార్యక్రమం ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. వచ్చే నెల 10వ తేదీ వరకు ఇక్కడ ఉచితంగా శిక్షణ కొనసాగుతుందన్నారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర

మద్దిలపాలెం: పాత వెంకోజీపాలెంలో ఎల్లమాంబ అమ్మవారి జాతర బుధవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాల తో అలంకరించారు. సాయంత్రం సీతారామా సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామాలయం నుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామస్తులు అమ్మవారికి సారె సమర్పించారు. జాతరలో భాగంగా చిరువ్యాపారులు ఏర్పాటు చేసిన షాపుల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. రాత్రికి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.